సాక్షి ఆదిలాబాద్

గురువారం । 17 । అక్టోబర్ । 2024

నేడు వాల్మీకి జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఉదయం 10.30గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వాల్మీకి, బోయ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

కైలాస్‌నగర్: కుమురంభీం వర్ధంతి పురస్కరించుకుని నేడు జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ప్రకటనలో పేర్కొన్నారు. పోరాట యోధుడి జయంతి సందర్భంగా జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవుదినంగా ప్రకటించినట్లు తెలిపారు. బదులుగా నవంబర్ 9న రెండో శనివారం యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు రూ.20 కోట్ల నిధుల విడుదల

కైలాస్‌నగర్: జిల్లాకు సీఆర్‌ఆర్ ప్లేన్ గ్రాంట్స్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.10కోట్లు, బోథ్ నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున కేటాయించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో రోడ్లు, వంతెనల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసింది. నిధుల విడుదలపై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 26 వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీసు శాఖ సూచించిన లింక్ ద్వారా ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు 'విచక్షణతో కూడిన మొబైల్ వాడకం' అంశంపై, డిగ్రీ విద్యార్థులకు 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫొటోగ్రఫీ పోటీలు

జిల్లాలోని విద్యార్థులు, యువత, ఫొటో, వీడియోగ్రాఫర్లకు షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, పోలీసులు చేసిన సేవలు, కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు తదితర అంశాలపై ఫొటో, షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించాలని పేర్కొన్నారు. వాటిని ఈనెల 27లోగా జిల్లా పోలీసులు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన లింక్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

నార్నూర్: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల హాజరుశాతం పెంచడంతోపాటు మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని డీఐఈవో రవీందర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చొరవ చూపాలన్నారు. కళాశాలలో ఇతర సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ కేశవులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాకు 10 మంది ఏవోలు



డీఏవోకు రిపోర్టు చేస్తున్న ఏవోలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న మండల వ్యవసాయ అధికారి (ఏవో) పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి పలువురికి పోస్టింగ్ కల్పించింది. జిల్లాకు పది మందిని కేటాయించగా, బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఇదివరకు ఎనిమిది మండలాలకు ఏవో పోస్టులు ఖాళీగా ఉండగా, ఆ పోస్టులు భర్తీ అయ్యాయి. డీఏవో కార్యాలయంలో ఇద్దరు టెక్నికల్ ఏవోలుగా విధుల్లో చేరారు.

విధుల్లో చేరిన ఏవోలు వీరే..

అధికారి	కేటాయించిన మండలం
కేంద్రె ఆకాశ్	నార్నూర్–1
రాథోడ్ శ్రద్ధరాణి	సిరికొండ
జె.పూజ	జైనథ్–1
మహ్మద్ సాద్	బజార్‌హత్నూర్
లింగంపల్లి రవితేజ	బోథ్
కె.కృష్ణవేణి	నేరడిగొండ
జె.యెంకన్న	నార్నూర్–2 (గాదిగూడ)
సాయితేజ	బేల
తడెం విశ్వనాథ్	డీఏవో కార్యాలయం, ఆదిలాబాద్
జాహ్నవి	డీఏవో కార్యాలయం, ఆదిలాబాద్



హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన పీసీసీ ఉమ్మడి జిల్లా సమీక్షలో పాల్గొన్న జిల్లా ముఖ్య నేతలు

హస్తంలో లుకలుకలు!

- 'పార్లమెంట్' ఓటమిపై కాంగ్రెస్‌లో మరోసారి రచ్చ
- బద్నాం చేయడం తగదంటూ ఒకరిద్దరు నేతల ఆవేదన
- పీసీసీ సమావేశంలో విభేదాలు మరోసారి బహిర్గతం
- నేతల తీరుపై కార్యకర్తల్లో అయోమయం

సాక్షి,ఆదిలాబాద్: 'గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో మనం ఓడిపోయినప్పటికీ అంతకుముందు ఎన్నికలతో పోల్చితే అధికంగా ఓట్లు సాధించాం.. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే ఎన్నికల్లో సాధించిన ఓట్ల కంటే పార్లమెంట్ ఎన్నికల్లోనే అధికంగా వచ్చాయి.. అయినప్పటికీ మమ్మల్ని బద్నాం చేస్తున్నారు.. అభ్యర్థికి సహకరించలేదని ఆరోపిస్తున్నారు.. పార్టీ ఈ విషయంలో లోతైన పరిశీలన చేయాలి.. నియోజకవర్గాల్లో సహకరించకపోతే ఆ స్థాయిలో ఓట్లు ఎలా వస్తాయి.. ఓటమి పరంగా ఇదే కారణంగా భావించకుండా మరో కోణం ఏదైనా ఉందా అనేది పరిశీలన చేయాలి..' ఇది మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేత అగ్రనేతల ముందు అన్న మాటలివి.

దిశానిర్దేశం..

పీసీసీ సమావేశంలో ప్రధానంగా రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎలా ముందుకెళ్లాలనే విషయంలో అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లానుంచి ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, వెడ్మబొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, సీనియర్ నేతలు ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాల్‌చారి, రాథోడ్ బాపూరావు, విఠల్‌రెడ్డి, లోక భూమారెడ్డి, జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సురేఖ, విశ్వప్రసాద్ రావు, శ్రీహరిరావు, పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలునారాయణరావు పాటిల్, శ్రీహరిరావు, రావి శ్రీనివాస్, కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్ నాయక్, అడ్డి భోజారెడ్డి, లోక భూమారెడ్డి, గోక గణేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీ వైపు మళ్లిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోపు ఓటర్లను మనవైపు ఆకర్షించేలా సమష్టి కృషి జరగాలని కీలకనేతలు హితబోధ చేశారు. పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని ఇన్‌చార్జి మంత్రులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. మొత్తంగా పార్టీలో ప్రస్తుతం ఈ వ్యవహారాలు చర్చనీయాంశంగా మారాయి.

పార్లమెంట్ ఎన్నికలు ముగిసి నెలలు గడిచిపోయాయి. ఈ ఎలక్షన్‌లో ఓటమిపై కాంగ్రెస్ పార్టీలో పంచాయితీ ఇంకా తెగలేదు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమీక్ష సమావేశం మంగళవారం రాష్ట్ర రాజధానిలో నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిపై కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి పైవిధంగా అగ్రనేతల ముందు వాపోయినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ ఈ విషయంలో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో పార్టీ మూడో స్థానంలో నిలుస్తుందేమో అనుకున్నప్పటికీ రెండో స్థానంలో నిలిచిందని ఇది అందరి సమష్టి కృషి ఫలితమేనని పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తంగా ఈ విషయం పార్టీలో ప్రస్తుతం చర్చకు దారి తీసింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత జిల్లా పార్టీలో ఫలితాల విషయంలో నేతల మధ్య విభేదాలు నెలకొనడం, నియోజకవర్గాల్లో నేతలు సహకరించలేదని కొంత మంది ఆరోపించడం అప్పట్లో ప్రాధాన్యత సంతరించుకుంది. తాజాగా ఇప్పటికీ కూడా ఆ విషయం సద్దుమణగలేదు అనడానికి పీసీసీ సమావేశంలో ప్రస్తావన రావడం నిదర్శనం. జిల్లాలో ముఖ్య నాయకుల మధ్య విభేదాలను మరోసారి ఈ సంఘటన స్పష్టం చేస్తుంది. కార్యకర్తల్లో అయోమయం కలిగిస్తుంది.

కొత్త టీచర్లొచ్చారు

- విధుల్లో చేరిన 256 మంది
- నలుగురు గైర్హాజరు
- అబియాన్స్‌లో ఆరుగురి పోస్టులు



నేరడిగొండ ఎంపీయూపీఎస్ తర్నం(కె)లో రిపోర్టు చేస్తున్న కొత్త టీచర్ సృష్టి

ఆదిలాబాద్‌టౌన్: డీఎస్సీ–2024 ప్రక్రియ ద్వారా నియామకమైన కొత్త టీచర్లు బడిబాట పట్టారు. కౌన్సెలింగ్ ద్వారా మంగళవారం అర్ధరాత్రి వరకు పోస్టింగ్ కేటాయింపు ప్రక్రియ కొనసాగింది. నియామకమైన ఉపాధ్యాయులు బుధవారం ఉదయం వారు ఎంచుకున్న పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు. మండల విద్యాధికారులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రిపోర్టు చేశారు. మరోవైపు ఇదివరకు బదిలీ అయి పాత స్థానాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యారు. వారు ఇదివరకు ఎంచుకున్న స్థానాల్లో విధుల్లో చేరారు. జిల్లాలో 265 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగినప్పటికీ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండటం, రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం వారిని ఇప్పటి వరకు రిలీవ్ చేయలేదు. డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరడంతో వీరు కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేశారు.

నియామకం ఇలా..

మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో 324 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఉర్దూ మీడియంతో పాటు ఆయా కేటగిరీల్లో అర్హతగల అభ్యర్థులు లేకపోవడంతో 266 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో 72 మంది స్కూల్ అసిస్టెంట్లు, 194 మంది ఎస్జీటీలు ఉన్నారు. మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌లో 266 మందికి గాను 256 మందికి పోస్టింగ్ కల్పించారు. నలుగురు కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. వీరికి ఆబ్సెంట్ పోస్టు ఇవ్వనున్నారు. ఆరుగురి పోస్టులను అబియాన్స్‌లో పెట్టారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో రెండో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి, ఎస్జీటీ మరాఠీ మీడియంలో ఇద్దరు అభ్యర్థుల బోనఫైడ్‌లపై అభ్యంతరాలు రావడంతో వాటిని పరిశీలించేందుకు అబియాన్స్‌లో పెట్టారు. అలాగే ఒక ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థి, ఎస్జీటీ తెలుగు మీడియంలో 12వ ర్యాంకు అభ్యర్థి పేరు లిస్టులో లేకపోవడంతో రోస్టర్‌లో చివరిగా ఉన్న ఇద్దరు అభ్యర్థుల పోస్టులను అబియాన్స్‌లో ఉంచినట్లు డీఈవో తెలిపారు.

ఇంకా కొరత తీరలేదు..

జిల్లాలో మొత్తం 3,042 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 2,422 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మరో 620 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. తాజాగా చేపట్టిన డీఎస్సీలో 324 పోస్టులు భర్తీ కావాల్సి ఉండగా, 266 మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 354 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో డీఎస్సీ ద్వారా త్వరలో ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్లు కాంగ్రెస్ సర్కారు ఇటీవల ప్రకటించింది. దీంతో ఈ డీఎస్సీలో కొలువులు దక్కని వారు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు నిరుద్యోగ అభ్యర్థులకు మేలు చేకూరనుంది. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేయడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు కొలువులు దక్కించుకున్న అభ్యర్థుల కుటుంబ సభ్యుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి

- ఎస్పీ గౌస్ ఆలం



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ముందుగా సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయ పరిసరాలు పరిశీలించారు. ఆదిలాబాద్ పట్టణ పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల దరఖాస్తులను వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు అప్పగించి సమస్య పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. 5ఎస్ విధానం అమలు చేస్తూ రికార్డుల నిర్వహణ చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డితో పాటు సీఐలు కరుణాకర్ రావు, సునీల్‌కుమార్, శ్రీనివాస్, నవీన్, సిబ్బంది జైపాల్, రవి, కిష్టయ్య, రమేశ్ తదితరులున్నారు.

పోరుగడ్డ ముస్తాబు



ప్రజలు కూర్చునేందుకు వీలుగా చేస్తున్న ఏర్పాట్లు

- జోడేఘాట్‌లో నేడు కుమురంభీం 84వ వర్ధంతి
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న రాష్ట్ర మంత్రి సీతక్క
- ఉదయం 9 గంటలకు సమాధి వద్ద పూజ..
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు
- 15వేల మంది తరలివస్తారని అధికారుల అంచనా..

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన పోరాటయోధుడు, ఆదివాసీల ముద్దుబిడ్డ కుమురంభీం 84 వర్ధంతికి కెరమెరి మండలంలోని పోరుగడ్డ జోడేఘాట్ గ్రామం ముస్తాబైంది. రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎంపీ గోడం నగేశ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు తదితర ప్రముఖులు హాజరై భీం విగ్రహానికి నివాళులర్పించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే ప్రజల కోసం జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గురువారం ఉదయం 8గంటలకు జెండాలు ఆవిష్కరించనున్నారు. 9 గంటలకు సమాధి వద్ద పూజలు చేసి, 10 గంటలకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పలుమార్లు జోడేఘాట్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చకచకా ఏర్పాట్లు.. పటిష్ట బందోబస్తు

కుమురంభీం వర్ధంతి కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇటీవల భీం విగ్రహానికి మెరుగులు దిద్దారు. టెంట్లు వేయడంతోపాటు పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్ పనులు చేపట్టారు. భారీగా గిరిజనులు, గిరిజనేతరులు తరలివచ్చే అవకాశం ఉండటంతో తాత్కాలికంగా మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పనుల పర్యవేక్షణ కోసం గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఏటీడబ్ల్యూవోలు ముగ్గురు, సీఆర్‌టీలు, రెగ్యులర్ టీచర్లు వందమంది, ఆశ్రమ వార్డెన్లు ఐదుగురు, సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించారు. అలాగే ఐకేపీ సిబ్బంది 35 మంది, ఇంజినీరింగ్‌శాఖకు చెందిన పది మంది పనిచేస్తున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో 460 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. ఇందులో ఎస్పీతోపాటు ముగ్గురు డీఎస్పీలు, సీఐలు 15 మంది, ఎస్సైలు 28 మంది ఉన్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచే భోజనం తయారీ పనులు ప్రారంభమవుతాయని, 20వేల మందికి భోజనం సరిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. 150 మంది వంట మనుషులను నియమించారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రత్యేకంగా పది బస్సులు ఏర్పాటు చేశారు.



జోడేఘాట్‌లోని కుమురంభీం స్మారక స్తూపం

ఆదాయమున్నా అద్దె భవనాలే!



ఇది ఆదిలాబాద్‌లోని ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి పనులున్నా ఇక్కడికే వస్తుంటారు. ఆడిట్, చిట్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సైతం ఇందులోనే ఉండటంతో వివిధ పనుల నిమిత్తం వినియోగదారులు వస్తుంటారు. అయితే ఇక్కడ వాహనాల పార్కింగ్‌కు స్థలం లేదు. అరకొర వసతుల నడుమ ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, పనుల కోసం వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు.



ఇది రూ.2కోట్ల వ్యయంతో ఇటీవల నూతనంగా నిర్మించిన బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. అన్ని హంగులతో సిద్ధం చేశారు. అయితే ఇంకా శిథిలావస్థకు చేరిన, ఎలాంటి వసతులు లేని అద్దె భవనంలోనే కార్యాలయ వ్యవహారాలు నిర్వహిస్తుండడం గమనార్హం. దీంతో ఉద్యోగులతో పాటు, వినియోగదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

- సొంత భవనాల్లేక ఇబ్బందులు
- వాహనాల పార్కింగ్‌కూ స్థలం కరువు
- జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల దుస్థితి

కైలాస్‌నగర్: జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ప్రభుత్వానికి కోట్లలో ఆదాయం సమకూర్చే ఈ కార్యాలయాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సరైన వసతులు లేకపోవడంతో అక్కడ పనిచేసే ఉద్యోగులు, సిబ్బందితో పాటు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వినియోగదారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల మాట అటుంచితే ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వ్యవహారాలు పర్యవేక్షించే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగులు తమ వాహనాలు నిలిపేందుకు సైతం పార్కింగ్ స్థలం లేకపోవడం గమనార్హం. ఎక్కడో రోడ్డుపైన నిలిపి రావాల్సిన పరిస్థితి. పైగా చిన్నపాటి వర్షం కురిసినా లీకేజీలతో భవనం ఊరుస్తుంది. ఫస్ట్ ఫ్లోర్‌లోని మరుగుదొడ్డికి సంబంధించిన పైపులైన్ లీకేజీతో నీరంతా కిందికి కారుతూ దుర్గంధం వెదజల్లుతోంది.

అరకొర వసతుల నడుమ...

జిల్లాలో బోథ్, ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని టీఎస్ఎస్ఎఫ్‌సీ కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ సంస్థకు ప్రతి నెల రూ.15వేల అద్దె చెల్లిస్తున్నారు. అయితే భవనాన్ని ఖాళీ చేయాలంటూ ఎస్ఎఫ్‌సీ అధికారులు రిజిస్ట్రేషన్ అధికారులకు సూచించినట్లుగా తెలుస్తోంది. అందుకే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లీజు అగ్రిమెంట్ ఇప్పటి వరకు చేసుకోలేదని సమాచారం. ఇక బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రతినెలా రూ.5వేల అద్దె చెల్లిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరుకుగదుల్లో ఉండటంతో ఉద్యోగులతో పాటు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.2కోట్ల వ్యయంతో ఇటీవల కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించారు. అయితే నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. ఇక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రతి నెలా రూ.21వేల అద్దె చెల్లిస్తున్నా సరైన వసతుల్లేవు.

ఇబ్బందులు లేకుండా చర్యలు..

నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. బోథ్ సబ్ రిజిస్ట్రార్ నూతన కార్యాలయంపై నాకెలాంటి సమాచారం లేదు. నూతన కార్యాలయాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు కోరలేదు. కార్యాలయాలకు వచ్చే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్ రావు, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు తయారు చేసి భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నం.2లో బుధవారం సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. డీఈవో ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ, ప్రజలకు ఉపయోగపడే అంశాలను తయారు చేయాలని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలన్నారు. సైన్స్ సెమినార్‌లో 16, సైన్స్‌డ్రామాలో 7 పాఠశాలలకు సంబంధించి విద్యార్థులు ఆరు థీమ్స్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈనెల 18న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని, అందులో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఇందులో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరు పల్లెలు.. తీరని వెతలు

- అభివృద్ధికి దూరంగా 12 పోరు గ్రామాలు
- ఏళ్లుగా అధ్వానంగా రహదారులు
- తాగు, సాగునీటికి ఇబ్బందులు
- పక్కా గృహాలు అందక.. గుడిసెల్లో నివాసం
- ప్రభుత్వాలు మారుతున్నా.. మెరుగుపడని వసతులు


పాటగూడ గ్రామానికి వెళ్లే దారి దుస్థితి

అధ్వానంగా శివగూడకు వెళ్లే దారి



శివగూడ గ్రామస్తులు తాగునీటికి వినియోగిస్తున్న చెలిమె

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గోండు బెబ్బులి కుమురంభీం వర్ధంతి గురువారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించనున్నారు. కెరమెరి మండలంలోని జోడేఘాట్, జోడేఘాట్ కొలాంగూడ, టోకెన్‌మోవాడ్, బాబేఝరి కొలాంగూడ, బాబేఝరి గోండ్‌గూడ, బాబేఝరి మహరాజ్‌గూడ, శివగూడ, చిన్నపట్నాపూర్, పెద్ద పట్నాపూర్, పాటగూడ, లైన్‌పటార్, పిట్టగూడ గ్రామాలను ఏకం చేసి భీం పోరు సాగించారు. ఈ గ్రామాలను పోరు పల్లెలుగా పిలుస్తారు. అయితే ప్రత్యేక రాష్ట్రంలోనూ ఇక్కడ పరిస్థితులు మారలేదు.. సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజన ప్రజల జీవితాల్లో మార్పు కనిపించడం లేదు. కనీసం శుద్ధ జలం, మెరుగైన వైద్యం అందని పరిస్థితులున్నాయి. నేడు కుమురంభీం వర్ధంతి సందర్భంగా పోరుగ్రామాల స్థితిగతులపై కథనం.

ఏళ్లుగా అవే సమస్యలు

కెరమెరి మండలం హట్టి నుంచి జోడేఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేర వచ్చదనం పరుచుకుని ఉంటుంది. అయితే అక్కడ పోరు గ్రామాల్లో మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కొందరికి రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాలు అందించింది. అయితే సాగునీరు, భూములకు పట్టాలు, రుణాలు అందక.. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర సౌకర్యాలు లేక కష్టాలతో జీవనం సాగిస్తున్నారు. శుద్ధమైన మిషన్ భగీరథ నీరందక చాలామంది ఇప్పటికీ బావులు, చెలిమెల నీరు తాగుతున్నారు.

- జోడేఘాట్‌లో 50 ఇళ్లు ఉండగా 270 మంది నివాసం ఉంటున్నారు. నాలుగు చేతిపంపుల్లో ఒకటే పనిచేస్తోంది. గిరిజన ఆశ్రమ పాఠశాలఉంది. ఐదేళ్ల క్రితం ఐటీడీఏ ఆధ్వర్యంలో బిగించిన సోలార్ నిరుపయోగంగా మారింది. 30 డబుల్ బెడ్రూం ఇళ్లలో మూడు మాత్రమే పూర్తయ్యాయి.
- జోడేఘాట్ కొలాంగూడలో 20 కుటుంబాలు, 175 జనాభా ఉంది. స్థానికంగా పాఠశాల లేక విద్యార్థులు జోడేఘాట్‌కు వెళ్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రం లేదు.
- టోకెన్‌మోవాడ్‌లో 20 కుటుంబాలు, 96 మంది నివాసం ఉంటున్నారు. కొందరికి ఇప్పటికీ పట్టాలు లేక బ్యాంకు రుణాలు అందడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్లు అందక పెంకుటిళ్లలో జీవనం వెల్లదీస్తున్నారు.
- బాబేఝరి కొలాంగూడలో 23 కుటుంబాలు, 170 జనాభా ఉంది. భగీరథ నీరు రాకుంటే కిలోమీటర్ దూరంలోని బావి నుంచి నీటిని తెచ్చుకుంటారు. ఎడ్లజతలు మంజూరు చేయాలని రైతులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.
- బాబేఝరి గోండ్‌గూడలో 23 కుటుంబాల్లో 132 మంది ఉన్నారు. ఆరుగురి భూములకు పట్టాలు అందలేదు. భారీ వర్షం కురిస్తే గుట్ట పైనుంచి ఇళ్లలోకి వరద చేరుతుంది. ఇక్కడ పది కుటుంబాలకు పక్కా ఇళ్లు లేవు.
- బాబేఝరి మహరాజ్‌గూడలో 35 కుటుంబాల్లో 173 మంది ఉన్నారు. కొందరికి రేషన్ కార్డులు, పోడు పట్టాలు లేవు. స్థానికులు ఎక్కువగా బావి నీటినే తాగుతున్నారు.
- శివగూడ 15 కుటుంబా లు ఉండగా.. 70 మంది నివాసం ఉంటున్నారు. అంగన్‌వాడీ కేంద్ర, ప్రాథమిక పాఠశాల లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. చెలిమె నీటిని తాగుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఐటీడీఏ అధికారులు ఇక్కడ 13 మోడల్ గృహాలు నిర్మించారు. మరో మూడు కుటుంబాలకు ఇళ్లు అందాల్సి ఉంది.
- చిన్నపట్నాపూర్ 48 కుటుంబాలు, జనాభా 228 ఉంది. నూతనంగా ఇళ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- పెద్దపట్నాపూర్‌లో 27 కుటుంబాల్లో 183 మంది ఉన్నారు. ఇక్కడ కూడా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేదు.
- పాటగూడలో 43 కుటుంబాలు ఉండగా.. 220 మంది జీవనం సాగిస్తున్నారు. కానుగ మొక్కల పెంపకంతో ఈ గ్రామం పేరు సంపాదించింది. 20 మంది విద్యార్థులున్నా పాఠశాల లేదు. రైతులకు పట్టాలు లేక రుణాలు పొందలేకపోతున్నారు.
- లైన్‌పటార్‌లో 11 కుటుంబాల్లో 48 మంది ఉన్నారు. పాఠశాల లేదు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టోకెన్‌మోవాడ్ నుంచి సరైన రోడ్డు సౌకర్యం లేదు.
- పిట్టగూడలో 11 కుటుంబాల్లో 50 మంది ఉన్నారు. ఉపాధ్యాయుడు లేక పాఠశాల తెరుచుకోవడం లేదు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పక్కా ఇళ్లు నిర్మించాలి



సుమారు 50 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వంతో నేటికీ పూరి గుడిసెల్లోనే ఉంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించాలి.

– ఆత్రం పావుగా, పాటగూడ, మం:కెరమెరి

అధ్వానంగా రోడ్డు



టోకెన్‌మోవాడ్ నుంచి లైన్ పటార్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. అటవీ శాఖ నుంచి అనుమతులు మంజూరు చేసి బీటీ రోడ్డు నిర్మించాలి. ఇందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– ఆత్రం భీంరావు, లైన్‌పటార్, మం:కెరమెరి

గోండు బెబ్బులి.. భీం

- నేడు జోడేఘాట్‌లో 84వ వర్ధంతి


జోడేఘాట్‌లోని కుమురంభీం విగ్రహం

ఆసిఫాబాద్: గోండు బెబ్బులి, ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం.. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లిలో కుమురం చిన్ను, సోంబాయి దంపతులకు 1901లో జన్మించిన ఆయన నిజాం ప్రభుత్వ దోపిడీ, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ వీరోచితంగా పోరాడారు. అడవిపై ఆదివాసీలకు హక్కులు కల్పించాలని జల్, జంగల్, జమీన్ నినాదంతో ఉద్యమం చేపట్టారు. నేడు భీం వర్ధంతి నేపథ్యంలో ఆయన పోరాటంపై కథనం.

అకృత్యాలను చూడలేక..

గిరిజన ప్రాంతాల్లో పెత్తందార్లు, అటవీశాఖ అధికారుల అకృత్యాలను కుమురంభీం కళ్లారా చూశారు. మేకల మేత కోసం చెట్టుకొమ్మ కొట్టిన తన స్నేహితుడు పైకు చేతివేళ్లను జంగ్లాత్ సేరేదార్ నరికించడాన్ని చూసి భీం కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి చిన్ను విషజ్వరంతో మృతి చెందడంతో సోదరులు సోము, బొజ్జుతో కలిసి రౌటసంకెపల్లిని వీడి కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చేరుకున్నారు. అక్కడ ఆదివాసీలు నెలల తరబడి అడవిని నరికి సేద్యం చేయగా, పంట చేతికొచ్చే సమయానికి సిద్దిక్ అనే జాగిర్దార్ భూముల స్వాధీనం చేసుకునేందుకు యత్నించాడు. సిద్దిక్‌పై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. భీం అక్కడి నుంచి పారిపోయి బల్లార్షా మీదుగా మహారాష్ట్రలోని చాందా చేరుకున్నారు. అక్కడ కొంతకాలం పనిచేసి అస్సాం వెళ్లిపోయారు. కాఫీ, తేయాకు తోటల్లో పనిచేస్తూ ఐదేళ్లు గడిపారు.

దట్టమైన అడవుల్లో పోరాటం

అస్సాం నుంచి తిరిగి వచ్చిన కుమురంభీం కెరమెరి మండలం జోడేఘాట్ కేంద్రంగా నిజాం సర్కార్‌పై గెరిల్లా పోరాటం చేశారు. ఆయనకు సూరు, వెడ్మరాము సహచరులుగా ఉన్నారు. యువకులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించవద్దని గ్రామాల్లోని ప్రజలను చైతన్యపరిచారు. అప్పుల పేరుతో పంట దోచుకునేందుకు వచ్చే వ్యాపారులు, పన్ను వసూళ్లకు వచ్చే రెవెన్యూ అధికారులపై దాడులు కొనసాగించారు. బాబేఝరి కేంద్రంగా గిరిజనులు అడవి నరికి 12 పోరు గ్రామాలను ఏర్పాటు చేశారు. నిజాం సర్కారు వారిపై కేసు పెట్టింది. కేసుల నుంచి విముక్తి కోసం హైదరాబాద్ వెళ్లిన భీంకు నవాబు కలిసే అవకాశం దొరకలేదు. ఆయన తిరిగి వచ్చేసరికి జంగ్లాత్, తదితరులు 12 గ్రామాలపై విరుచుకుపడి తగులబెట్టారు. కలత చెందిన భీం జల్, జంగల్, జమీన్ సాధించాలంటే ఇంటికో పోరాటయోధుడు కావాలని పిలుపునిచ్చారు. గిరిజన యువకులతో సాయుధ దళం ఏర్పాటు చేశారు.

అనుచరుడి వెన్నుపోటుతో మరణం..

నిజాం ప్రభుత్వం చర్చలకు సబ్‌కలెక్టర్‌ను జోడేఘాట్‌కు పంపించింది. 12 గ్రామాలకు పట్టాలిస్తామని అప్పులన్నీ మాఫీ చేస్తామని ప్రతిపాదించాడు. కానీ భీం 12 పోరుగ్రామాల మీద రాజ్యాధికారం కావాలని డిమాండ్ చేయడంతో చర్చలు విఫలమయ్యాయి. విషయం నిజాం రాజుకు తెలియడంతో ఆగ్రహానికి గురై భీంను అంతమొందించాలని ఆదేశించాడు. 1940లో దాదాపు ఏడునెలల పాటు భీం అనుచరులు, నిజాం ప్రభుత్వ సేనల మధ్య యుద్ధం సాగింది. భీం అనుచరుడు మడావి కొద్దు ఇచ్చిన సమాచారంతో అక్టోబర్ 10న భీకరపోరులో కుమురంభీం నేలకొరిగారు. నాలుగు దశాబ్దాలుగా ఏటా జోడేఘాట్‌లో భీం వర్ధంతి నిర్వహిస్తున్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో దర్బార్ ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

మంచిర్యాలటౌన్: మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కార్యాలయంలో దివ్యాంగులకు ఉపకరణాలను జిల్లా సంక్షేమ శాఖ అధికారి జి.స్వరూప రాణి పంపిణీ చేశారు. 4జీ స్మార్ట్‌ఫోన్లు 9, హియరింగ్ హెడ్స్ నాలుగు దివ్యాంగులకు అందజేశారు. ఎఫ్ఆర్‌వో ఫర్జానా బేగం, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్ పాల్గొన్నారు.

మూగ మగ వ్యక్తిపై లైంగిక దాడి

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్‌లో నాలుగు రోజుల క్రితం 32ఏళ్ల మూగ మగ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల మగ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయించేందుకు సిద్ధం కాగా పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. బుధవారం మార్కెట్ యార్డు సమీపంలో మహాలక్ష్మివాడకు చెందిన రిజ్వాన్ ఖాన్, సాయితేజ కిలో 20గ్రాముల గంజాయిని విక్రయించేందుకు యత్నించారు. వీరు మహారాష్ట్రలోని యావత్మాల్‌కు చెందిన సయ్యద్ అలీ నుంచి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

పాముకాటుకు ఆశా కార్యకర్త మృతి


ఆశా వర్కర్ కుమ్రు దుర్పతబాయి(ఫైల్)

ఇంద్రవెల్లి: పాముకాటుతో ఆశా కార్యకర్త మృతి చెందిన ఘటన మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొలాం గిరిజన మహిళ కుమ్రు దుర్పతబాయి(33) ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంట్లోకి చొరబడిన పాము ఆమె నిద్రలో ఉండగా కాటు వేసింది. కొద్దిసేపటికి ఆమె వాంతులు చేసుకొని స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు ఆమె శరీరాన్ని పరిశీలించగా పాము కాటు గుర్తులను కనిపించాయి. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త సోనేరావ్‌తో పాటు కూతుళ్లు శ్రీదేవి, అఖిల, కుమారుడు సందీప్ సంతానం. తల్లిని కోల్పోయిన చిన్నారులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


నాఫెఖాన్ (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో ఈనెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాఫెఖాన్ (58) బుధవారం మృతి చెందాడు. ఖానాపూర్ నివాసి నాఫెఖాన్ నిర్మల్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. తన ద్విచక్రవాహనంపై ఖానాపూర్‌కు పని నిమిత్తం వచ్చి నిర్మల్ వెళ్తుండగా ఎక్బాల్‌పూర్ గ్రామంలో డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని నిర్మల్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అత్యాచారం కేసులో ఒకరికి 20ఏళ్ల జైలు

- రూ.7వేల జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.7వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి పి.శివరాంప్రసాద్ తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జమీల్‌ఖాన్ అరబిక్ భాష నేర్పే క్రమంలో పిల్లల ఇంటికి వెళ్లి పాఠాలు చెప్పేవాడు. అందులో భాగంగా 2021 ఫిబ్రవరి 14న ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన ఆ బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేయగా, డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ రమణారెడ్డి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైందని తెలిపారు. ఈ మేరకు జడ్జి తీర్పు నిచ్చినట్లు వివరించారు.

ఆటో తగులబెట్టిన యువకుల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన జాదవ్‌పండిత్ ఆటోను తగులబెట్టిన ముగ్గురు యువకులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భుక్తాపూర్‌కు చెందిన దగడ్ సాయి, శ్రీరాం కాలనీకి చెందిన దస్‌గట్ సుధీర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన మసాల అజయ్ మంగళవారం తెల్లవారుజామున ఆటోను తగులబెట్టారు. పండిత్ జాదవ్‌కు కిరాణ షాపు ఉండగా రాత్రి కావడంతో మూసివేశాడు. సిగరేట్, గుట్కాలు ఇవ్వలేదనే కోపంతో వారు ఆటోను తగలబెట్టినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలు

భైంసాటౌన్: పట్టణంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ లైన్‌మెన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. నర్సాపూర్(జి) మండలం తురాటి గ్రామానికి చెందిన పులి జైపాల్ భైంసా పట్టణ సబ్‌స్టేషన్‌లో ఏఎల్ఎంగా పనిచేస్తున్నాడు. బుధవారం మహాగాం రోడ్డులో డబుల్ బెడ్రూం గృహ సముదాయం సమీపంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా తీగలు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య పరామర్శించారు.

చేతికొచ్చిన పంట.. చేయి దాటిపోయె!


తడిసిన సోయాను చూసి రోదిస్తున్న హన్మంతు


జేసీబీతో వాగులో నుంచి వెలికితీస్తున్న సోయా సంచులు

- ఇంటికి తరలిస్తుండగా నీటిపాలైన సోయా పంట
- వాగులో బోల్తా కొట్టిన ట్రాక్టర్ ట్రాలీ
- రూ.1.20 లక్షల పంట నష్టం

భైంసాటౌన్/ముథోల్: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికొచ్చిందని రైతు మురిసిపోయాడు.. పంట సాగుకు చేసిన అప్పులు తీర్చేయాలని ఎంతో ఆశ పడ్డాడు.. కానీ పంట ఇంటికి కూడా చేరకముందే రైతు ఆశలు ఆవిరయ్యాయి. ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేసిన సోయా పంట వాగుపాలైన ఘటన బుధవారం ముథోల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ముథోల్ మండలకేంద్రానికి చెందిన రైతు శ్యామోల్ల సాయినాథ్ ముథోల్ శివారులోని కర్బాల మార్గంలో ఉన్న తన పంట చేనులో సోయా సాగు చేశాడు. 30 క్వింటాళ్ల దిగుబడి రాగా సంచుల్లో నింపి ట్రాక్టర్‌లో ఇంటికి తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో వాగు దాటుతుండగా ట్రాక్టర్ ట్రాలీ వాగులో బోల్తా పడగా సంచులన్నీ నీట మునిగాయి. వెంటనే జేసీబీ సహాయంతో ట్రాక్టర్ ట్రాలీ, సోయా సంచులు నీటి నుంచి వెలికితీసినా పంట పూర్తిగా తడిసిపోయింది. చేతికొచ్చిన పంట ఇంటికి రాకముందే నీటిపాలు కావడంతో సాయినాథ్, అతని తండ్రి హన్మంతు కన్నీరుమున్నీరయ్యారు. రూ.1.20లక్షల వరకు పంట నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతును ఆదుకోవాలని, వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా కోప్రా గ్రామానికి చెందిన ముండే జ్యోత్స్న(36) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కడుపునొప్పితో ఏడాదిగా బాధపడుతున్న ఈమె మంగళవారం ఉదయం పంట చేలో పురుగుల మందు తాగింది. కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై నజీబ్ తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


అరవింద్ (ఫైల్)

కుంటాల: కుంటాల పంచాయతీ పరిధి సేవాలాల్ తండాకు చెందిన చవాన్ అరవింద్ (28) బుధవారం వేకువజామున ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దేవ్‌రావు కథనం ప్రకారం చవాన్ అరవింద్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన అరవింద్ జీవితంపై విరక్తి చెంది అఘాయిత్యానికి పాల్పడినట్లు ఏఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యంమత్తులో యువకుడు..


మహేష్(ఫైల్)

బెల్లంపల్లిరూరల్: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధి పెద్ద దుబ్బలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద దుబ్బకు చెందిన మంచాల మహేష్(24) మెకానిక్ పని చేస్తున్నాడు. దసరా పండుగ నుంచి అతిగా మద్యం సేవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం అతిగా మద్యం సేవించి కింద పడిపోగా స్నేహితులు ఇంటి వద్ద దించి వెళ్లారు. అతిగా మద్యం సేవిస్తున్నందున తల్లిదండ్రులు మందలిస్తారని భయపడి ఇంట్లోని బాత్రూంలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించి మంగళవారం రాత్రి మహేష్ మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో 16 మందికి జీవితఖైదు


రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం సింగల్‌గూడకు చెందిన అజ్మీర రమేశ్ హత్య కేసులో 16 మంది నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.1,49,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు వెలువరించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. సింగల్‌గూడకు చెందిన అజ్మీర రమేశ్ సోదరి రాజేశ్వరి ఇంటికి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన జర్పుల సురేశ్ అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు కేకలు వేయడంతో రమేశ్, అతడి కుమారుడు లోకేశ్ ఇంటి నుంచి బయట వచ్చారు. వారిని చూసి సురేశ్ పారిపోయాడు. ఆ తర్వాత బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న అజ్మీర రమేశ్‌పై జర్పుల సురేశ్‌తోపాటు మరో 15 మంది దాడి చేసి గొడ్డలితో తలపై నరికారు. రాజేశ్వరితోపాటు రమేశ్ భార్య రేణుకను సైతం గాయపర్చారు. తీవ్రంగా గాయపడిన రమేశ్ మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదుతో అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి రమేశ్ కేసు నమోదు చేశారు. జర్పుల సురేశ్, జర్పుల సత్యవతి, అజ్మీర వసంత్‌రావు, జర్పుల తిక్యానాయక్, జర్పుల హరీశ్, అజ్మీర అరవింద్, అజ్మీర నవీన్, అజ్మీర ప్రవీణ్, అజ్మీర సంతోష్, అజ్మీర ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, జర్పుల రజిత, జర్పుల తుకారాం, జర్పుల రవి, జర్పుల రాజు, జర్పుల బిక్యానాయక్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉమేశ్వర్ 16 మంది నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు సాక్ష్యులను విచారించగా నేరం రుజువైంది. ప్రధాన న్యాయమూర్తి రమేశ్ నిందితులకు జీవితఖైదు జైలుశిక్ష, రూ.1,49,000 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు, డీఎస్పీ కరుణాకర్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, కానిస్టేబుల్ ఉమేశ్వర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పోలీసుల అత్యుత్సాహం సరికాదు


మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉట్నూర్‌లో అక్రమంగా కేసు నమోదు చేయడంలో పోలీసుల అత్యుత్సాహం సరికాదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో కేసులు పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు రాజగంగన్న, వాల్‌సింగ్, సుమన్, ప్రదీప్, సుమిత్, సంతోష్, శ్రావణ్, నరేందర్, బుచ్చాగౌడ్, రమేశ్ ఉన్నారు.

పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలి


పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణకేంద్రంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లకు బుధవారం నిర్వహించిన రెండో సెమిస్టర్ చివరి పరీక్షను పరిశీలించారు. తొమ్మిది నెలలుగా శిక్షణ పొందుతున్న 254 మంది పరీక్ష రాసినట్లు ఎస్పీ తెలిపారు. ఆయన వెంట శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ సమయ్‌జాన్‌రావు, నిజామాబాద్ సీటీసీ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్సై రాకేశ్ ఉన్నారు.

హత్య కేసులో ముగ్గురు రిమాండ్

భీమిని: కన్నెపల్లి మండలం షాలిగాంలో గోమాస నరేందర్ హత్య కేసులో ముగ్గురిని పోలీసులు బుధవారం రిమాండ్ చేశారు. మంగళవారం షాలిగాం గ్రామంలో నరేందర్ హత్య ఘటనలో పోలీసులు విచారణ చేపట్టారు. నరేందర్ మామ గోలేటి శంకర్, అత్త గోలేటి లక్ష్మి, భార్య భవాని అలియాస్ బేబిలను బెల్లంపల్లి కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులను జైలుకు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరికైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంటరైన కుమారుడు

కన్న తండ్రి కాటికి, కన్న తల్లి, తాతయ్య, అమ్మమ్మలు జైలుకు వెళ్లడంతో బేబి కుమారుడు ఒంటరయ్యాడు. పాలు తాగే పాప(13 నెలలు) తల్లి వెంటే వెళ్లడంతో కుమారుడు(4) బంధువుల ఇంట్లో ఉన్నాడు. అమ్మ, నాన్న ఎక్కడున్నారో, ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్నాడు.